# పుస్తక పరిచయం




**"వంకర టింకర మాటల** / శంకరనారాయణ లఘు శంకలు లేకన్ / వంకలు నెలవంకలుగా / సంకల్పిత చంద్రకళలు సభలో కురిసెన్" అని ఒక అవధాని గారు ప్రశంసిస్తే - పూర్వం అవధాని ఎవరు కనుక్కొని అవధానానికి వచ్చే ప్రేక్షకులు ప్రస్తుతం 'అప్రస్తుత ప్రసంగం' ఎవరూ అని కనుక్కొని వస్తున్నారు. ఇందుకు కారకుల్లో శంకరనారాయణగారు ఒకరు - అని మరో అవధానిగారు అభినందించారు. కేవలం అవధానాలే కాదు, ఎక్కడైనా, ఎలాంటి సభలో నైనా కేవలం మాటవిరుపులతో అద్భుతమైన హాస్యాన్ని పండించగల చతురులు శంకరనారాయణగారు. వాక్యాన్ని విడగొట్టడం లేదా ప్రాస కుదిరే మరో పదాన్ని చేర్చడమో అలవోకగా చేస్తూ, నవ్వుల పువ్వుల్ని కురిపించడం శంకరనారాయణగారి ప్రత్యేకత. ఆంధ్రరాష్ట్రాల్లోను, విదేశాల్లోనూ కూడా వీరి 'మాట దెబ్బ' రుచి చూడని వారు చాలా అరుదు. పదిహేనేళ్ళ క్రిందట వారు వ్రాసిన ఒక పుస్తకాన్ని అమెరికాలో ఆవిష్కరించే అవకాశం కౌముదికి లభించింది. ఆ సందర్భంలో వారి వ్యాఖ్య ' ఈ పుస్తకాన్ని రచించింది నేను, పేకెట్ చించింది కిరణ్‌ప్రభగారు' అనగానే హాలంతా చప్పట్లతో నిండిపోయింది. ఒక్కరే నిల్చుని ఒకేసారి పదిమంది ప్రాశ్నికులనైనా అవలీలగా ఎదుర్కొంటూ, స్థాయితగ్గని నవ్వుల్ని పంచడంలో శంకరనారాయణగారు నిష్ణాతులు. వారి ఆత్మకథ, ఈ ప్రయాణంలో పెద్దవారితో వారి అనుభవాలు - అన్నీ కలిసినదే ఈ పుస్తకం. సినీప్రముఖులతోనూ, రాజకీయ ప్రముఖులతోనూ కల్సిన సందర్భం ఎంతచిన్నదైనా, పెద్దదైనా మాటమాటకీ ఎలా నవ్వించారో అనేక సంఘటనలు ఉదహరించారిందులో. వందలాది సన్మానాలను, బిరుదులనూ అందుకున్న శంకరనారాయణగారి ఈ ఆత్మకథా కథనాలను ప్రచురించింది - హ్యూస్టన్‌లోని వంగూరి ఫౌండేషన్ వారు. వారి 66వ ప్రచురణగా వెలువడిన ఈ పుస్తకంలోని ప్రతిపేజీ, ప్రతి వాక్యం హాసంతో కూడిన ఆహ్లాదాన్ని పంచుతుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తిలేదు. శంకరనారాయణగారు పాల్గొన్న సభలనుంచి కొన్ని అరుదైన ఛాయాచిత్రాలు కూడా ఈ పుస్తకం ప్రత్యేకత.

***

**Published by:**
Vanguri Foundation of America
(Houston, TX)
PO Box: 1948 , Stafford, TX-77497
Phone: 832 594 9054




*భైతి దుర్గయ్య, టీచర్*
*గ్రా. రామునిపట్ల*
*మం. చిన్నకోడూర్*
*సిద్ధిపేట, మెదక్ జిల్లా - 502267*
*సెల్: 995 900 7914*

**మెదక్ జిల్లాలోని** రామునిపట్ల గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భైతి దుర్గయ్యగారు మూడేళ్ళ క్రిందట ప్రచురించిన స్వీయకవితా సంపుటి ఈ ‘అక్షర సేద్యం‘. నిబద్ధతతో , నిజాయితీతో వ్రాసిన వచన కవితలివన్నీ. ఇందులోని అన్ని కవితలూ సామాజిక సమస్యలని విశ్లేషిస్తూ, అభిప్రాయాన్ని ప్రకటిస్తూ, కొన్నిసార్లు పరిష్కారాలను సూచనమాత్రంగా చిత్రిస్తూ వ్రాసిన కవితలు. మొదట్లో వారు వివిధ సామాజిక సమస్యలమీద వార్తా పత్రికలకు లేఖలు వ్రాస్తూ ఉండేవారట. అవి చదివిన కొంతమంది మిత్రులు "సమస్యను అర్థవంతంగా సూటిగా ఆవిష్కరిస్తున్నారు. ఇలాంటి భావాలను కవితల రూపంలో వ్రాయొచ్చుగదా" అని సలహా ఇచ్చారట. ఆ విధంగా పునాదిపడిన ఈ కవితలు ఇందులో 32 ఉన్నాయి. పదిమందీ చెప్పిన సమస్యలే ఐనా వాటిని దుర్గయ్యగారు తనదైన శైలిలో కవిత్వీకరించారు. ఈ కవితలన్నీ వివిధ పత్రికల్లో, కవితా సంకలనాల్లో వచ్చినవే. ఈ పుస్తకానికి ముందుమాట వ్రాసిన అన్నవరం దేవేందర్ గారు ఈ కవితల్లోని ఆత్మను అవిష్కరించారు. "తెలంగాణా ఉద్యమం దుర్గయ్యగారి లాంటి ఎంతో మంది కవులకు ప్రేరణ కలిగించిందనీ, అస్తిత్వవాద ఉద్యమాలే ఊపిరిగా పుట్టే కవితలు పఠితలను సూటిగా తాకుతాయనీ" దేవేందర్ గారి వ్రాశారు. దుర్గయ్యగారి కవిత్వం నిండా పల్లెలు, ఊర్ల ప్రతీకలు, ప్రపంచీకరణ సృష్టించిన విధ్వంసాలు, మాయమైపోతున్న చేతివృత్తులూ ప్రతి పేజీలోనూ ప్రతి కవితలోనూ కనిపిస్తాయి. 2012 లోనే తెలంగాణా ఉద్యమాన్ని బలపరుస్తూ వ్రాసిన కవిత " వృధా కాదు మీ త్యాగఫలం / ఏనాటికైనా అది సఫలం / పంటచేను కూలీల / జానపదమై / పశువుల కాపర్ల / పాట పల్లవై.." అంటూ సాగుతుంది. కవితల శీర్షికలే కవితా వస్తువుకు అద్దంపడతాయి. ‘మానవత్వం‘,‘ అన్నదాత‘,‘ మహాత్మా మళ్ళీ జన్మించు‘,‘ గురుదేవా మీకు వందనం‘ .. ఇలా. దుర్గయ్యగారి భావవ్యక్తీకరణకు కొన్ని ఉదాహరణలు "గొంగడి భుజాన వేసుకుని / గొడ్డలి చేత పట్టుకుని ‘ సద్ది దూపకు చంకనేసుకుని / గొర్రెల వెంట చేను చెల్కకు / తిరిగే సంచారజీవి కుర్మగొల్ల.."; " పసిపాపలను ఊరడించే తల్లుల జోలపాటలు / పని ఒత్తిడి మరిపించే / పశు కాపర్ల ఈల పాటలు..". ఈ పుస్తకంలో విరివిగా దొర్లిన అచ్చుతప్పుల్ని మలిముద్రణలో సవరిస్తారని ఆశించవచ్చు.

***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**